తెలంగాణ శాసనసభ

దినపత్రికలో
అన్ని రకాల ప్రకటనలు
అడ్వర్టైజ్మెంట్స్ మరియు
వార్తల కోసం

సంప్రదించండి: 9100900931

TELANGANA SHASANA SABHA TELTEL/2016/68867

తెలంగాణ శాసనసభ తెలుగు దినపత్రిక

Published from Hyderabad,Rangareddy,Nalgonda,Mahabubnagar, Khammam,

తెలంగాణ | సంపుటి : 02 | సంచిక : 198 | ఎడిటర్ : పోలగోని రాజేష్ | సోమవారం 23 డిసెంబర్ - 2024 | పేజీలు : 8 | వెల : 04/-

# అల్లు అర్జున్ నివాసంపై దాడిని ఖండించిన సీఎం రేవంత్ రెడ్డి

- హైదరాబాదులో స్టార్ హీరో అల్లు అర్జున్ నివాసంపై దాడి
- సినీ ప్రముఖుల ఇళ్లపై దాడి ఘటనను ఖండిస్తున్నానంటూ రేవంత్ రెడ్డి ప్రకటన
- శాంతిభద్రతల విషయంలో కఠినంగా వ్యవహరించాలని పోలీసులకు ఆదేశాలు



శాసనసభ / హైదరాబాద్ : సినీ ప్రముఖుల ఇళ్లపై దాడులు చేయడం పట్ల సీఎం రేవంత్‌రెడ్డి స్పందించారు. ఫిల్మ్ స్టార్స్ నివాసాలపై దాడులు సరికాదని అభిప్రాయపడ్డారు. ఈ తరహా ఘటనలను తీవ్రంగా ఖండిస్తున్నట్లు ఆయన తన ఎక్స్ ఖాతాలో ట్వీట్ చేశారు. శాంతి భద్రతల విషయంలో కఠినంగా వ్యవహరించాలని రాష్ట్ర డీజీపీ జితేందర్, నగర పోలీస్ కమిషనర్ సీవీ ఆనంద్‌ను ఆదేశిస్తున్నట్లు వెల్లడించారు. ఈ విషయంలో ఎలాంటి అలసత్వాన్ని సహించవద్దని అధికారులకు స్పష్టం చేశారు. సంధ్య థియేటర్ ఘటనతో సంబంధంలేని పోలీసు సిబ్బంది స్పందించవద్దని, ఉన్నతాధికారులు ఈ ఘటనపై తగిన జాగ్రత్తలు తీసుకోవాలని రేవంత్ రెడ్డి ఆదేశించారు.

మిగతా »»4లో




శాసనసభ/ హైదరాబాద్ : ఓయూ జేఏసీ విద్యార్థి సంఘాల ఆందోళనతో జూబ్లీహిల్స్‌లోని అల్లు అర్జున్ ఇంటి వద్ద తీవ్ర ఉద్రిక్తత చోటు చేసుకుంది. రేవతి మరణానికి అల్లు అర్జునే కారణమంటూ పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. మృతురాలు రేవతి కుటుంబానికి వెంటనే రూ.కోటి పరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు.

»»4లో

- అల్లు అర్జున్ ఇంటిపై రాళ్లు విసిరిన ఓయూ జేఏసీ నాయకులు
- రేవతి కుటుంబానికి వెంటనే రూ.కోటి పరిహారం చెల్లించాలని డిమాండ్
- పూల కుండీలు, గార్డెన్‌లోని మొక్కలు ధ్వంసమయ్యాయి.

# అల్లు అర్జున్ నివాసంపై దాడి వెనకున్నది కాంగ్రెస్ పార్టీయేనా?



- హైదరాబాదులో అల్లు అర్జున్ నివాసంపై దాడి
- రాళ్లు విసిరి, పూలకుండీలు ధ్వంసం చేసిన విద్యార్థి జేఏసీ నేతలు
- కాంగ్రెస్ ప్రభుత్వ చేతగానితనానికి ఇదే నిదర్శనమన్న కిషన్ రెడ్డి

శాసనసభ / హైదరాబాద్ : హైదరాబాదులో అల్లు అర్జున్ నివాసంపై విద్యార్థి సంఘాల నేతలు రాళ్ల దాడికి పాల్పడడం పట్ల కేంద్రమంత్రి, తెలంగాణ బీజేపీ చీఫ్ కిషన్ రెడ్డి స్పందించారు.

మిగతా »»4లో

# ముఖ్యమంత్రికి అల్లు అర్జున్ వెంటనే క్షమాపణ చెప్పాలి



- ప్రెస్ మీట్ పెట్టిన అల్లు అర్జున్
- అల్లు అర్జున్ వ్యాఖ్యలపై మంత్రి కోమటిరెడ్డి స్పందన
- రేవంత్ రెడ్డి వ్యాఖ్యలకు ఎదురుదాడిగా మాట్లాడడం సరికాదని స్పష్టీకరణ

మిగతా »»4లో

# అల్లు అర్జున్ కు బండి సంజయ్ సపోర్ట్



- అల్లు అర్జున్ వ్యక్తిత్వాన్ని హననం చేసేలా ప్రవర్తిస్తున్నారని ఆగ్రహం
- రేవంత్ సినీ పరిశ్రమపై పగబట్టినట్టుందని వ్యాఖ్యలు
- ఎంఐఎంతో కలిసి కుట్ర చేస్తున్నారని ఆరోపణ

శాసనసభ/ హైదరాబాద్ : సంధ్య థియేటర్ వ్యవహారంలో రాజకీయ నేతలు కూడా రెండు పక్షాలుగా విడిపోయారు. అధికార కాంగ్రెస్ ఒకవైపు, విపక్షాలు మరోవైపు నిలిచాయి. తాజాగా, కేంద్ర సహాయమంత్రి బండి సంజయ్ హీరో అల్లు అర్జున్ కు మద్దతు పలికారు..

మిగతా »»4లో


## అల్లు అర్జున్‌కు మేం వ్యతిరేకం కాదు..

# తప్పు ఎవరు చేసిన కేసు నమోదు చేస్తాం

- ప్రాణం కంటే సినిమా ప్రమోషన్ ఎక్కువ కాదన్న డీజీపీ జితేందర్
- సినిమా హీరో సహా ఎవరైనా సరే బాధ్యతగా ఉండాలని హితవు
- పోలీసులు వ్యక్తిగతంగా ఎవరికీ వ్యతిరేకం కాదని వివరణ



# ఎన్నికల సంఘం సమగ్రతను నాశనం చేసేందుకు కుట్ర



ఢిల్లీ / శాసనసభ : కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే కేంద్ర ప్రభుత్వంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎన్నికలకు సంబంధించిన ఎలక్ట్రానిక్ రికార్డులను తనిఖీ చేసేందుకు అనుమతించే నిబంధనల్లో ఎన్నికల సంఘం మార్పులు చేయడాన్ని తప్పుబట్టారు. ఈసీ సమగ్రతను నాశనం చేయడానికి కేంద్ర ప్రభుత్వం పన్నిన కుట్రలో ఇదొక భాగమని ఆరోపించారు. రాజ్యాంగం, ప్రజాస్వామ్యంపై మోదీ ప్రభుత్వం చేస్తున్న దాడికి వ్యతిరేకంగా కాంగ్రెస్ పోరాడుతూనే ఉంటుందని అన్నారు. "ఎన్నికల కమిషన్‌ను నిర్వీర్యం చేయడానికి మోదీ ఇంతకు ముందు ఎన్నికల కమిషనర్లను నియమించే సెలక్షన్ ప్యానెల్ నుంచి భారత ప్రధాన న్యాయమూర్తిని తొలగించారు. ఇప్పుడు వారు చేసే కుట్రలు బయటకు రాకుండా ఉండేందుకు మార్పులు చేస్తున్నారు. ఓటర్ల పేర్లు తొలగింపు, ఈవీఎంలలో పారదర్శకత లేకపోవడం వంటి అక్రమాల గురించి మేము ఎన్నిసార్లు ఫిర్యాదు చేసినా ఈసీ స్పందించలేదు. ఇప్పుడు కేంద్ర ప్రభుత్వం చేస్తున్న కుట్రలు బయటకు రాకుండా చేసేందుకు పోలింగ్‌కు సంబంధించిన సీసీ టీవీ ఫుటేజ్‌ను, అభ్యర్థులకు చెందిన వీడియో రికార్డులను తనిఖీ చేయకుండా నిషేధం విధించింది.

# కరెంట్ ఖాతాల ద్వారానే ఎక్కువగా సైబర్ నేరాలు



శాసనసభ / హైదరాబాద్ : సైబర్ నేరాల వల్ల ఈ ఏడాది హైదరాబాద్ కమిషనరేట్ పరిధిలో రూ. 297 కోట్లు పోగొట్టుకున్నారని కమిషనర్ సీవీ ఆనంద్ తెలిపారు. పరువు పోతుందనే ఉద్దేశంతో చాలా మంది ఫిర్యాదు చేయడానికి ముందుకు రావట్లేదని తెలిపారు. హైదరాబాద్ కమిషనరేట్ వార్షిక మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. డయల్ 100కి వస్తున్న ఫిర్యాదులపై స్పందన పెరిగిందన్నారు. ఫిర్యాదులు అందిన తర్వాత ఘటనాస్థలికి వెళ్తున్న సమయం బాగా తగ్గిందన్నారు. రాత్రిపూట పోలీసుల గస్తీ కూడా పెంచామన్నారు. సౌండ్ పొల్యూషన్‌పై తాము తీసుకున్న నిర్ణయాలకు ప్రజల నుంచి మద్దతు వస్తోందని చెప్పారు. డీజేల సౌండ్‌పై అప్పుడప్పుడు ఇంకా కొన్ని ఫిర్యాదులు వస్తున్నాయన్నారు.

# రాహుల్ గాంధీకి సమన్లు జారీ చేసిన యూపీ కోర్టు..!



ఢిల్లీ / శాసనసభ : కాంగ్రెస్ అగ్రనేత, లోక్‌సభలో ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీకి యూపీ కోర్టు సమన్లు జారీ చేసింది. అసెంబ్లీ ఎన్నికల ప్రచారంలో కులగణన పై ఆయన చేసిన వ్యాఖ్యలపై బరేలీ జిల్లా కోర్టు ఈ సమన్లు జారీ చేసినట్లు అధికారిక వర్గాలు తెలిపాయి. 'ఎన్నికల ప్రచారంలో రాహుల్ గాంధీ కులగణనపై చేసిన వ్యాఖ్యలు దేశంలో అంతర్యుద్ధానికి దారి తీసేలా ఉన్నాయి. అందుకే ఆ వ్యాఖ్యలపై తొలుత ఎంపీ-ఎమ్మెల్యే కోర్టులో కేసు దాఖలు చేశాం. అక్కడ కేసును కొట్టివేశారు. దీంతో బరేలీ జిల్లా కోర్టును ఆశ్రయించాం. ఈ క్రమంలోనే కోర్టు రాహుల్‌కు సమన్లు జారీ చేసింది. వచ్చే ఏడాది జనవరి 7న హాజరుకావాలని కోర్టు అందులో పేర్కొంది' అని పిటిషనర్ తెలిపారు.

# "అంబేద్కర్ వ్యాఖ్యల"పై అమిత్ షాకి వ్యతిరేకంగా డీఎంకే తీర్మానం..



ఢిల్లీ / శాసనసభ : రాజ్యాంగంపై చర్య సందర్భంగా రాజ్యసభలో కేంద్ర హోం మంత్రి అమిత్ షా "అంబేద్కర్"పై అనుచిత వ్యాఖ్యలు చేశారంటూ కాంగ్రెస్‌తో పాటు దాని మిత్ర పక్షాలు,ఇండియా పార్టీలు ఆరోపిస్తున్నాయి. అమిత్ షా తన పదవికి రాజీనామా చేయాలని, కేబినెట్ నుంచి బర్తరఫ్ చేయాలని డిమాండ్ చేస్తున్నారు. అయితే, తన వ్యాఖ్యల్ని కాంగ్రెస్ వక్రీకరిస్తోందని అమిత్ షా అన్నారు. కాంగ్రెస్ తన జీవితంలో ఎప్పుడూ కూడా అంబేద్కర్‌ని గౌరవించలేదని బీజేపీ ఎదురుదాడి చేస్తోంది. ఇదిలా ఉంటే, తమిళనాడు సీఎం ఎంకే స్టాలిన్ అధ్యక్షతన ఆదివారం జరిగిన డీఎంకే కార్యవర్గ సమావేశంలో 12 తీర్మానాలను ఆమోదించింది. పార్లమెంట్‌లో బీఆర్ అంబేద్కర్‌పై అమిత్ షా చేసిన వ్యాఖ్యలపై తొలి తీర్మానం చేశారు. ఈ తీర్మానంలో అమిత్ షా వ్యాఖ్యల్ని ఖండించారు. "ప్రజాస్వామ్య దేవాలయంలో దేశ హోంమంత్రి ఇంత అవమానకరంగా మాట్లాడటం సిగ్గుచేటు.

»»4లో

# స్ఫూర్తి

## జీవితం- మొగ్గలు

ముళ్ల కంపలను పూలవనం చేస్తూ
రంప తిమిరం ను చీల్చడమే మనిషీ
ప్రతియడుగు వెలుగు కై వెదకితేనే జీవితం

కలలు కలత కన్నీళ్లలతో తడిపినా
కష్టాలకీ వెరువక కదలడమే మనిషీ
నష్టాలు నిలబడవనీ నిదానిస్తేనే జీవితం

అణువణువు రంగులు మార్చే లోకానా
అంతరంగనా చెడు చేరనియకుండుటే మనిషీ
కోంతనైనా పరహితం చెస్తేనే జీవితం

కొసరు చూపులను కరకు మాటలను కలిపి
చురుకు ప్రవాహం కావడమే మనిషీ
బేరకు లేక భవిత దిద్దుకోవడమే జీవితం

చుట్టూ కానరాని కంటకాలను చేధిస్తూ
చీకట్లున్నా కడదాక యత్నించడమే మనిషీ
మెట్టుమెట్టు గట్టి ఘనతలు చేరడమే జీవితం

రెండు హృదయాలు ఒక్కటయ్యే చోట
గొంగళిపురుగు సీతాకోక కావుటయే మనిషీ
చెడు ఆలోచనలు వీడితేనే సుందరం జీవితం

డా.ఐ.చిదానందం
చరవాణి - 8801444335

శాసనసభ


# రాష్ట్ర ప్రభుత్వం ఇద్దరి పిల్లల నిబంధన ఎత్తేయాలి : కాసాల



**చండూర్ డిసెంబర్ 22 (శాసనసభ న్యూస్):** గ్రామ పంచాయతీ, మండల, జిల్లా పరిషత్ స్థానిక సంస్థల ఎన్నికల్లో పోటీ చేసేవారు ఇద్దరి కంటే ఎక్కువ సంతానం కలిగి ఉండరాదన్న నిబంధనను వచ్చే స్థానిక సంస్థల ఎన్నికల్లో రాష్ట్ర ప్రభుత్వం ఎత్తేయాలని భారతీయ జనతా కిసాన్ మోర్చా నల్గొండ జిల్లా ఉపాధ్యక్షులు కాసాల వెంకట్ రెడ్డి కోరారు. ఆదివారం ఆయన శాసనసభ ప్రతినిధితో మాట్లాడుతూ ఈ నిబంధన ఎత్తేయాలని పంచాయతీరాజ్ శాఖ ప్రతిపాదించినా, రాష్ట్ర కేబినెట్ తిరస్కరించడంలో అంతర్యం ఏంటని ఆయన ప్రశ్నించారు. కొంతకాలంగా ఇద్దరి పిల్లల నిబంధనను ఎత్తేస్తున్నట్లుగా ప్రచారం చేసి చివరకు తుస్సు మనిపించడం వెనక మతలబ్ ఉందన్నారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో ఈ నిబంధన ఎత్తేసినట్టుగా తెలంగాణ రాష్ట్రంలో ఇద్దరి పిల్లల నిబంధన ఎత్తేయాలన్నారు.

# రాయపోల్ లో ఎరువుల గిడ్డంగుల నిర్మాణానికి శంకుస్థాపన

- రైతులకు అందుబాటులోకి ఎరువులు విత్తనాలు.
- ఇబ్రహీంపట్నం వ్యవసాయ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ మంకాల కరుణాకర్.





**ఇబ్రహీంపట్నం, శాసనసభ న్యూస్ ప్రతినిధి డిసెంబర్ 22 :** ఇబ్రహీంపట్నం శాసనసభ్యులు మల్‌రెడ్డి రంగారెడ్డి సహకారంతో రైతులకు మరింత అందుబాటులోకి వ్యవసాయ ఎరువులు, విత్తనాలు అందుబాటులోకి తీసుకురావాలని, ఇబ్రహీంపట్నం మండలం రాయపోలు గ్రామంలో పిఏసిఎస్ దండు మైలారం వారి ఆధ్వర్యంలో విత్తనాలు, యూరియా, ఎరువుల గిడ్డంగుల నిర్మాణం కోసం ఆదివారం నాడు శంకుస్థాపన చేసిన చైర్మన్ బిట్ల వెంకట్ రెడ్డి,ఇబ్రహీంపట్నం వ్యవసాయ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ శ్రీ మంకాల కరుణాకర్. పిఏసిఎస్ వైస్ చైర్మన్ కంటేకార్ ఈశ్వర్, పిఏసిఎస్ డైరెక్టర్స్ జిలకాపల్లి ప్రభాకర్ రెడ్డి, దొండ యాదగిరి రెడ్డి. ఈ సందర్భంగా మంకాల కరుణాకర్ మాట్లాడుతూ రైతు పక్షపాతి అయినటు వంటి ప్రజా ప్రభుత్వంలో మరిన్ని నూతన ఆవిష్కరణలతో రైతులని అన్ని విధాలుగా ఆదుకుంటూ వ్యవసాయ రంగంలో భారతదేశంలోనే తెలంగాణ రాష్ట్రాన్ని అగ్రగామిగా నిలపడంలో ప్రజా ప్రభుత్వం మరింత కృషి చేస్తుందని తెలియజేశారు. అ రాష్ట్ర సేవదల్ ఉపాధ్యక్షులు మంకాల దాసు, మాజీ సర్పంచ్ బల్వంత్ రెడ్డి, మాజి ఎంపీటీసీ దొండ విష్ణు వర్ధన్ రెడ్డి, సిహెచ్ నర్సింహ్మ,మైలారం యాదయ్య, పొలాగోని శంకర్ గౌడ్, మాడాల శ్రీనివాస్ రెడ్డి,జెట్టి నర్సింగ్,పాశం నరసింహ్మ,పూజారి మైసయ్య, మొలుగు నరసింహ్మ, చెరుకు యాదయ్య, మొలుగు సంజీవ, గోదాల రాజిరెడ్డి, రైతులు తదితరులు పాల్గొన్నారు.

# మార్కెట్ డైరెక్టర్లకు సన్మానం ఎమ్మెల్యే మనంగారెడ్డికి కృతజ్ఞతలు



**యాచారం శాసన సభ న్యూస్ ( డిసెంబర్ 22) :** యాచారం మండల కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఇబ్రహీంపట్నం మార్కెట్ కమిటీ సభ్యులు, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు మస్క నరసింహ,గులాం అక్బర్, కాంగ్రెస్ మండల యూత్ అధ్యక్షుడు జయప్రకాశ్ కు ఘనంగా శాలువాతో సన్మానించారు. ఆదివారం ఈ సందర్భంగా... కాంగ్రెస్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఉప్పల భాస్కర్ , కాంగ్రెస్ మండల ప్రధాన కార్యదర్శి బట్టు శ్రీనివాస్, బిసి సెల్ మండల అధ్యక్షుడు వరికుప్పల తిరుమలేశు, ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి కి కృతజ్ఞతలు తెలిపారు. యాచారం మండల కాంగ్రెస్ నేతలు పార్టీ అభివృద్ధి కోసం కృషి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో రెడ్డి వెంకట్ రెడ్డి,మస్క అనిల్ ,గొల్లపల్లి భాస్కర్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.


# ఘనంగా భ్రమరాంబ మల్లికార్జున స్వామి జాతర





**జహీరాబాద్, శాసన సభన్యూస్ డిసెంబర్ 22 :** జహీరాబాద్ మండలం హగ్గెల్లీ గ్రామములో వెలసిన భ్రమరాంబదేవి మల్లికార్జున స్వామి జాతర మహొూత్సవం ఘనంగా జరిగింది. ఈసందర్భంగా జహీరాబాద్ మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు భ్రమరాంబ మల్లికార్జున స్వామివార్లను దర్శించుకుని ప్రజలందరూ చల్లగా ఉండాలని, అందరూ సుఖ సంతోషాలతో వర్ధిల్లాలని స్వామివారిని ప్రార్థించారు. స్వామివార్లను దర్శించుకున్న వారిలో జహీరాబాద్ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు నరసింహ్మారెడ్డి, సీనియర్ నాయకులు ఎంజీ రాములు, ఆ గ్రామ అధ్యక్షులు నరసింహ్మారెడ్డి, గ్రామ మాజీ సర్పంచ్ రాజు, మాజీ వైస్ ఎంపీపీ వీ. రాములు, మాజీ ఎంపీటీసీ నాగిశెట్టి, సి డి సి డైరెక్టర్ మల్లారెడ్డి, సుభాష్ రెడ్డి, మల్చల్మ సొసైటీ ఉపాధ్యక్షులు ఇమామ్ పటేల్, కొత్తూరు మాజీ సర్పంచ్ జగన్మోహన్, గ్రామ నాయకులు దేవస్థాన కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# తిరుమల శ్రీవారిని దర్శించుకున్న మర్రి నిరంజన్ రెడ్డి కుటుంబ సభ్యులు



**ఆదిభట్ల, శాసనసభ న్యూస్ ప్రతినిధి డిసెంబర్ 22 :** 22వ తేదీ ఆదివారం రోజున కలియుగ ప్రత్యక్ష దైవం తిరుమల తిరుపతి శ్రీ వెంకటేశ్వర స్వామిని కుటుంబ సభ్యులతో కలిసి దర్శించుకున్న (కుటుంబ సభ్యులు) టీపీసీసీ సభ్యులు, ఆదిభట్ల మున్సిపాలిటీ చైర్మన్ మర్రి నిరంజన్ రెడ్డి, మంచాల మండల మాజీ జెడ్పిటిసి మర్రి నిత్య నిరంజన్ రెడ్డి. ఈ ఈసందర్భంగా ఇబ్రహీంపట్నం నియోజకవర్గ ప్రజలందరూ సుఖ సంతోషాలతో,పాడిపంటలతో,అష్టైశ్వర్యాలతో సుభిక్షంగా ఉండాలని స్వామివారిని వేడుకున్నామని మర్రి తెలిపారు.

# అక్రమంగా కబేలాలకు తరలిస్తున్న గావులను పట్టి గోశాలకు తరలింపు





**చింతపల్లి, శాసనసభ న్యూస్ ప్రతినిధి డిసెంబర్ 22 :** మల్లేపల్లి పశువుల సంత నుండి భాగ్యనగరానికి అక్రమంగా గోవులను తరలిస్తుండగా వాహన తలఖీల్లో భాగంగా చింతపల్లి పోలీసులు పట్టుబడి చేసిన సంఘటన చింతపల్లి మండల కేంద్రంలో చోటుచేసుకుంది. చింతపల్లి సబ్ ఇన్స్పెక్టర్ బి. యాదయ్య తెలిపిన వివరాల ప్రకారం ఆదివారం సాయంత్రం చింతపల్లి పోలీసులు రోడ్డుపై వాహనాలను తనిఖీ చేస్తుండగా TSO6UA 8158 నెంబర్ గల మహేంద్ర బొలెరో గూడ్స్ వాహనం,TS31T 6905 అశోక్ లీ ల్యాండ్ వాహనాలలో కబేలాలకు అక్రమంగా తరలిస్తున్న 12 పశువులు, లేగ దూడలను పట్టుకొని పోలీస్ స్టేషన్ కు తరలించి స్టేషన్లో కేసు నమోదు చేసామని,పట్టుకున్న పశువులను నాగర్ కర్నూలు జిల్లా వెల్దండ గ్రామంలోని గురునానక్ గోశాలకు తరలించినట్లు ఎస్ఐ బి.యాదయ్య పేర్కొన్నారు.

# జన్మదిన వేడుకల్లో పాల్గొని చిన్నారులను ఆశీర్వదించిన ఎమ్మెల్యే బాలు నాయక్





**చింతపల్లి, శాసనసభ న్యూస్ ప్రతినిధి డిసెంబర్ 22 :** చింతపల్లి మండల కేంద్రానికి చెందిన సీనియర్ నాయకులు ఎల్లెంకి రాధాకిషన్ – యాదమ్మ మనవడు, వర్కాల గ్రామానికి చెందిన కుర్మేటీ కృష్ణయ్య మనవరాలు జన్మదిన వేడుకల్లో ముఖ్య అతిథిగా హాజరై,చిన్నారులను ఆశీర్వదించి,శుభాకాంక్షలు తెలిపిన దేవరకొండ ఎమ్మెల్యే నేనావత్ బాలు నాయక్. ఈ కార్యక్రమంలో మాల్ మార్కెట్ కమిటీ చైర్మన్ దొంతం అలివేలు సంజీవ రెడ్డి,దేవరకొండ మార్కెట్ కమిటీ చైర్మన్ నాయిని జమున మాధవ రెడ్డి,నల్గొండ పార్లమెంట్ కోఆర్డినేటర్ సిరాజ్ ఖాన్,మండల పార్టీ అధ్యక్షులు నాగభూషణం,మండల నాయకులు కొండల్ యాదవ్, పిఏసిఎస్ చైర్మన్ లింగంపల్లి వెంకటయ్య, మాజి సర్పంచ్ గడ్డం పురుషోత్తం రెడ్డి,మాజి ఎంపీటీసి సదానందం, కాసారపు శ్రీను, ఎలిమినేటి నర్సింహ్మ, సిద్ధిక్ బాబ,మాజీ కో ఆప్షన్ సభ్యులు జహంగీర్, రియాజ్ పాషా,గ్రామ శాఖ అధ్యక్షులు గోవిందు రవి తదితరులు పాల్గొన్నారు.

# రైతు భరోసా' మోసాన్ని ఎదిరించండి



**శాసనసభ / హైదరాబాద్:** రైతు భరోసాను ఎగవేసేందుకు కాంగ్రెస్ చేస్తున్న కుట్రలను ఎదిరించాలని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ రైతులకు విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు ఆదివారం ఆయన బహిరంగ లేఖ రాశారు. శాసనసభలో జరిగిన చర్చ సందర్భంగా అసలు విషయాన్ని తేల్చకుండా సంబంధంలేని అంశాలను ప్రస్తావించి ముఖ్యమంత్రి రేవంత్రెడ్డి సభను పక్కదారి పట్టించారని ఆరోపించారు. ఆంక్షలు, అనుమానాలు, సందేహాలు వేటికీ సమాధానం చెప్పకుండా దాట వేశారని విమర్శించారు. 'ఎన్నికలకు ముందు అందరికీ అన్నీ..ఎన్నికలయ్యాక కొందరికే కొన్ని' అంటూ ఉద్యోగులు, ఐటీ, పాన్కార్డు హోల్డర్లకు కటింగ్లు పెట్టి ఏదో రకంగా తప్పించుకోవాలన్న ఎజెండా తప్ప ప్రభుత్వానికి రైతులపట్ల చిత్తశుద్ధి లేదని విమర్శించారు. సన్నాలకు రూ.500 బోనస్ పేరిట మొత్తం సీజన్లో రూ.700 కోట్లు చెల్లించి, రూ.7,500 కోట్లకు ఎగనామం పెట్టిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. పెంచిన రైతు భరోసాను డిసెంబర్ 9న చెల్లిస్తామని చెప్పిన రాష్ట్ర ప్రభుత్వం ఏడాది గడిచినా అడుగు ముందుకు వేయలేదనీ, ఇప్పుడేమో మళ్లీ సంక్రాంతి తర్వాత అంటూ దాటవేస్తోందని విమర్శించారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో ఓట్ల కోసం వచ్చే కాంగ్రెస్ నాయకులను రైతు భరోసాపై నిలదీయాలని పిలుపునిచ్చారు. రుణమాఫీ విషయంలోనూ రైతులను కాంగ్రెస్ మోసం చేసిందని ఆరోపించారు. రూ.28 వేల కోట్ల రుణమాఫీ, రూ.73 వేల కోట్ల రైతుబంధు మొత్తంగా బీఆర్ఎస్ పదేండ్ల పాలనలో రూ.లక్ష కోట్లు రైతుల ఖాతాల్లో నేరుగా జమ చేశామని చెప్పారు. 'రైతుబంధు లబ్దిదారుల్లో 80 శాతం దళిత, గిరిజన, బహుజన రైతులే వున్నారు. పదెకరాల పైబడి వున్న రైతులు 1.3 శాతం మంది మాత్రమే. వాస్తవాలను కప్పిపుచ్చి రైతుబంధు మీద తప్పుడు ప్రచారం చేస్తున్నారు!పంట పెట్టుబడి రైతు హక్కు. రైతుకు ఏమిచ్చినా, ఎంతిచ్చినా తక్కువే! విత్తు వేసిన నాటి నుంచి పంట అమ్మేదాకా భరోసా లేదు. రాష్ట్రంలో 47 శాతం మందికి ఉపాధినిచ్చే పెద్ద పరిశ్రమ వ్యవసాయం! రెతులు, రైతు కూలీల బతుకు బాగుండాలంటే వ్యవసాయానికి సబ్సిడీలు ఇవ్వాలి' అని కేటీఆర్ లేఖలో డిమాండ్ చేశారు.

# నల్గొండ డీఈవోపై మహిళా కమిషన్ ఫైర్

చండూర్ డిసెంబర్ 22 (శాసనసభ న్యూస్) : నల్గొండ డీఈవో భిక్షపతిపై మహిళా కమిషన్ మండిపడింది. భిక్షపతి వేరే మహిళతో సహజీవనం చేస్తున్నాడని ఆయన మొదటి భార్య మాధవి గత నెల 27న మహిళా కమిషన్ కు ఫిర్యాదు చేశారు. శనివారం మహిళా కమిషన్ ముందు అటెండ్ అయిన బాధితురాలు తన ఫిర్యాదుపై వివరణ ఇచ్చి, ఆధారాలను అందజేశారు. ఈ ఆధారాలను పరిశీలించిన అనంతరం మహిళా కమిషన్ స్పందించింది. ఘటనపై సమగ్ర విచారణ జరిపి భిక్షపతిపై శాఖాపర మైన చర్యలు తీసుకోవాలని రాష్ట్ర విద్యా శాఖ సెక్రటరీని ఆదేశించింది. చర్యలు తీసుకున్న తరువాత ఏం చర్యలు తీసుకున్నారో తెలియజేస్తూ రిపోర్ట్ ఇవ్వాలని స్పష్టం చేసింది.

# నూతన వధూవరులను ఆశీర్వదించిన మాజీ ఎంపీటీసీ



**కొండమల్లేపల్లి శాసనసభ న్యూస్ డిసెంబర్ 22 :** ఆదివారం జరిగిన వివాహ వేడుకల సందర్భంగా వస్కుల సుధాకర్ -అలివేలు దంపతుల కుమారుడు- వస్కుల నరేష్ వివాహానికి హాజరైన మాజీ ఎంపీటీసీ రామావత్ రాణిరాజు నాయక్ వధువు వరులను ఆశీర్వదించడం జరిగింది. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు వస్కుల నగేష్,యవ నాయకులు మాజీ వార్డు సభ్యులు శ్రీను,రామావత్ భాస్కర్ గారు,మల్లేష్,అంబేద్కర్ యువజన సంఘం అధ్యక్షులు వస్కుల యాదయ్య, బాబు,బొడ్డుపల్లి మల్లేష్,లక్ష్మయ్య తదితరులు పాల్గొన్నారు.

## శ్రీతేజ్‌ను పరామర్శించా, కానీ..: జగపతి బాబు ఏమన్నారంటే?



**శాసనసభ / హైదరాబాద్:** పుష్ప-2 సినిమా ప్రీమియర్ షో సందర్భంగా సంధ్య థియేటర్ వద్ద జరిగిన తొక్కిసలాటలో రేవతి అనే మహిళ ప్రాణాలు కోల్పోగా.. ఆమె కుమారుడు శ్రీతేజ్ తీవ్ర గాయాలపాలైన విషయం విదితమే.ప్రస్తుతం శ్రీతేజ్ కిమ్స్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. ఈ ఘటన గత కొన్ని రోజులుగా తెలుగు సినీ ఇండస్ట్రీలో తీవ్ర కలకలం సృష్టిస్తోంది.ఘటనపై కేసు నమోదు చేసిన పోలీసులు.. ఇటీవల సినీనటుడు అల్లు అర్జున్‌ను అరెస్ట్ చేసిన విషయం తెలిసిందే. ఆ తర్వాత ఆయన బెయిల్‌పై విడుదలయ్యారు. ఈ నేపథ్యంలో అల్లు అర్జున్‌ను పలువురు సినీ ప్రముఖులు వెళ్లి పరామర్శించారు. దీంతో విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. బాధిత కుటుంబాన్ని పరామర్శించని సినీ ప్రముఖులు.. అల్లు అర్జున్‌ను పరామర్శించడంపై సీఎం సహా పలువురు రాజకీయ నాయకులు విమర్శలు ఎక్కుపెట్టారు.ఈ నేపథ్యంతో సినీనటుడు జగపతి బాబు సోషల్ మీడియా వేదికగా స్పందించారు. సంధ్య థియేటర్ బాధిత కుటుంబాన్ని తాను ఆస్పత్రికి వెళ్లానని.. అయితే, పబ్లిసిటీ చేసుకోలేదు కాబట్టే విషయం ఎవరికీ తెలియదన్నారు జగపతి బాబు 'అందరికీ నమస్కారం. ఓ క్లారిటీ కోసం ఈ ట్వీట్ పెడుతున్నా. నేను సినిమా షూటింగ్ నుంచి రాగానే.. సంధ్య థియేటర్ బాధిత కుటుంబాన్ని పరామర్శించేందుకు ఆస్పత్రికి వెళ్లా. బాలుడి తండ్రిని, సోదరిని పలకరించాలనిపించి అక్కడికి వెళ్లా. ఆ దేవుడు, అందరి ఆశీస్సులతో త్వరగానే బాలుడు కోలుకుంటాడని వారికి భరోసా ఇచ్చి వచ్చాను. అందరికంటే ఎక్కువ ఎఫెక్ట్ అయ్యింది ఆ కుటుంబం కాబట్టి.. నా వంతు సపోర్ట్ ఇవ్వాలనుకున్నా. పబ్లిసిటీ చేయలేదు. కాబట్టి విమర్శలు వచ్చాయి. క్లారిటీ ఇవ్వడానికే ఈ పోస్టు పెడుతున్నా' అని జగపతి బాబు ఓ వీడియో విడుదల చేశారు.అయితే, అల్లు అర్జున్ తండ్రి, సినీ నిర్మాత అల్లు అరవింద్ కొద్ది రోజుల క్రితం కిమ్స్ ఆస్పత్రికి వెళ్లి శ్రీతేజ్ కుటుంబాన్ని పరామర్శించిన విషయం తెలిసిందే. తొక్కిసలాట ఘటనకు సంబంధించిన కేసు కోర్టులో ఉన్నందున న్యాయనిపుణుల సలహా మేరకు తాను శ్రీతేజ్ కుటుంబాన్ని పరామర్శించలేకపోతున్నానని శనివారం మీడియా సమావేశంలో అల్లు అర్జున్ వెల్లడించారు. తన తండ్రితోపాటు సినిమా యూనిట్ కు సంబంధించిన వ్యక్తులు శ్రీతేజ్ కుటుంబాన్ని కలిశారని చెప్పారు. రేవతి కుటుంబానికి అన్ని విధాలుగా అండగా ఉంటామని తెలిపారు.

## నూతన వధూవరులను ఆశీర్వదించిన మంత్రివర్యులు ఎమ్మెల్యేలు



**కొండమల్లేపల్లి శాసనసభ న్యూస్ డిసెంబర్ 22 :** కొండమల్లేపల్లి మండల మాజీ ఎంపిపి దూదిపాల రేఖా శ్రీధర్ రెడ్డిలకుమార్తె నిశ్చతార్థం సందర్భంగా హైదరాబాద్ పరిధిలోని శంషాబాద్ లో గల కే ఎల్ సి సి కన్వెన్షన్ హాల్‌లో అంగరంగ వైభవంగా జరిగింది.ఈ కార్యక్రమంలో మంత్రివర్యులు నలమాధ ఉత్తమ్ కుమార్ రెడ్డి ,కోదాడ ఎమ్మెల్యే నలమాధ పద్మావతి ఉత్తమ్,భువనగిరి ఎమ్మెల్యే కుంభం అనిల్ గారు, దేవరకొండ నియోజకవర్గం ఎమ్మెల్యే బాలు నాయక్ విచ్చేసి నూతన వధూవరులను ఆశీర్వదించి,పుష్ప గుచ్ఛం అందచేసి శుభాకాంక్షలు తెలిపారు.

## శ్రీనివాస రామానుజన్ జన్మదినసందర్భంగా ఘనంగా మ్యాత్స్ డే

**కొండమల్లేపల్లి శాసనసభ న్యూస్ డిసెంబర్ 22 :** ప్రైమ్ అకాడమీ ఆధ్వర్యంలో మ్యాత్స్ డే సందర్భంగా శ్రీనివాస రామానుజన్ గారి జన్మదిన వేడుకను ఆదివారం కొండమల్లేపల్లి పట్టణంలోని మట్టిల్ల ఇంగ్లీష్ మాధ్యమ పాఠశాలలో ఘనంగా నిర్వహించారు .ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా పాల్గొన్న ప్రెస్ క్లబ్ ప్రెసిడెంట్ ఏరుకొండ రాము మాట్లాడుతూ మారుమూల ప్రాంతమైన కొండమల్లేపల్లి పట్టణంలో ఐఐటి ,సైనిక్ స్కూల్, నవోదయ తదితర పోటీ పరీక్షలకు శిక్షణ ఇవ్వడం అభినందనీయమన్నారు. ప్రపంచవ్యాప్తంగా ఉన్న గణిత మేధావులలో శ్రీనివాస రామానుజన్ గారు గణిత సంపన్నుడిగా పేరు పొందారని అన్నారు .ఆయనను విద్యార్థులు ఆదర్శంగా తీసుకోవాలన్నారు.ఈ సందర్భంగా కేక్ కట్ చేసి విద్యార్థులకు పండ్లు, స్వీట్లు పంపిణీ చేశారు. మ్యాత్స్ డే సందర్భంగా ప్రైమ్ అకాడమీ నిర్వాహకులు ఐఐటి




శ్రీనివాస్ గారిని విద్యార్థులు, ఉపాధ్యాయులు ఘనంగా సన్మానించారు.ఈ కార్యక్రమంలో కల్మూరి శ్రీనివాస్ ,సత్యనారాయణ,అనంతలక్ష్మి, వంశీ తదితరులు పాల్గొన్నారు.

## తొందరపాటు చర్యలొద్దు! అల్లు అర్జున్ నివాసంపై దాడి ఘటనపై అరవింద్



**శాసనసభ / హైదరాబాద్ :** హైదరాబాద్ జూబ్లీహిల్స్‌లోని సినీనటుడు అల్లు అర్జున్ నివాసంపై ఆదివారం ఉస్మానియా యూనివర్సిటీకి చెందిన కొందరు విద్యార్థులు దాడి చేసిన విషయం తెలిసిందే.ఈ దాడి ఘటనపై అల్లు అర్జున్ తండ్రి, సినీ నిర్మాత అరవింద్ విచారం వ్యక్తం చేశారు. అందరూ సంయమనం పాటించాలని, అదే మంచిదని వ్యాఖ్యానించారు.'మా ఇంటి బయట జరిగిందంతా చూశారు. ప్రస్తుతం మేం సంయమనం పాటించాల్సిన సమయం. దేనికీ రియాక్ట్ కాకూడదు. పోలీసులు వచ్చి ఆందోళనకు దిగినవారిని తీసుకెళ్లారు. కేసు పెట్టారు. ఎవరైనా గొడవ చేయడానికి వస్తే అదుపులోకి తీసుకునేందుకు పోలీసులు సిద్ధంగా ఉన్నారు' అని అరవింద్ తెలిపారు.ఇలాంటి దాడుల ఘటనలకు ఎవరూ ప్రోత్సహించకూడదని అల్లు అరవింద్ అన్నారు. మీడియా వచ్చారు కదా అని.. ఈ ఘటనపై మేం స్పందించం. సంయమనం పాటించాల్సిన సమయం. అదే పాటిస్తున్నాం. తొందరపడి ఎలాంటి చర్యలకు దిగొద్దు అని అరవింద్ విజ్ఞప్తి చేశారు. కాగా, ఈ రాళ్ల దాడిపై పోలీసులకు ఫిర్యాదు చేశారా? అని మీడియా ప్రశ్నించగా.. అల్లు అరవింద్ స్పందించకుండా వెళ్లిపోయారు.ఉస్మానియా యూనివర్సిటీ జేఏసీ విద్యార్థులు కొందరు అల్లు అర్జున్ నివాసం వద్ద ఆందోళన చేపట్టారు. రేవతి మరణానికి అల్లు అర్జునే కారణమంటూ పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. మృతురాలు రేవతి కుటుంబానికి న్యాయం చేయాలని.. వెంటనే రూ. కోటి పరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. ఈ క్రమంలో కొందరు ఆందోళనకారులు అల్లు అర్జున్ నివాసంపై రాళ్లు, టమాటాలు విసిరారు. ఇంట్లోకి నినాదాలు చేసుకుంటూ దూసుకెళ్లేందుకు యత్నించారు.రాళ్లు తగలడంతో అల్లు అర్జున్ ఇంటి ఆవరణలోని పూల కుండీలు, గార్డెన్‌లోని మొక్కలు ధ్వంసమయ్యాయి. విద్యార్థి సంఘాల ఆందోళన నేపథ్యంలో అప్రమత్తమైన పోలీసులు అక్కడికి చేరుకుని వారిని అదుపులోకి తీసుకున్నారు. ఈ క్రమంలో అల్లు అర్జున్ నివాసం దగ్గర అదనపు పోలీసు బలగాలతో బందోబస్తు ఏర్పాటు చేశారు.కాగా, దాడి ఘటన జరిగిన సమయంలో నటుడు అల్లు అర్జున్ తన నివాసంలో లేరని సమాచారం. విషయం తెలుసుకున్న అర్జున్ మామ, కాంగ్రెస్ నేత కంచర్ల చంద్రశేఖర్ రెడ్డి అక్కడికి చేరుకుని ఈ ఘటనపై ఆరా తీశారు. జరిగిన రాళ్ల దాడిపై సెక్యూరిటీ సిబ్బంది పోలీసులకు ఫిర్యాదు చేసే అవకాశమున్నట్టు తెలుస్తోంది.

## అల్లు అర్జున్ తీస్‌మార్ ఖాన్ అనుకుంటున్నాడా తోలు మంచిగా ఉంచుకో




**శాసనసభ / హైదరాబాద్:** అల్లు అర్జున్ అరెస్ట్ నటించిన పుష్ప 2 సినిమా ప్రీమియర్ షో సందర్భంగా ఆర్టీసీ క్రాస్‌రోడ్స్‌లోని సంధ్య థియేటర్ వద్ద తొక్కిసలాట చోటు చేసుకున్న ఘటనలో తీవ్రంగా గాయపడ్డ తొమ్మిదేళ్ల బాలుడు శ్రీతేజ్ ఆరోగ్య పరిస్థితిలో ఎలాంటి మార్పు ఉండట్లేదు.

**ఆరోగ్యం ఇంకా విషమంగానే ఉంది.**

సంధ్య థియేటర్ వద్ద జరిగిన తొక్కిసలాట ఘటనలో దిల్‌సుఖ్‌నగర్‌కు చెందిన రేవతి అనే మహిళ మృతి చెందిన విషయం తెలిసిందే. తొమ్మిది సంవత్సరాల వయస్సున్న ఆమె కుమారుడు తీవ్రంగా గాయపడ్డాడు. కిమ్స్ ఆసుపత్రి పీడియాట్రిక్ ఇంటెన్సివ్ కేర్ యూనిట్‌లో చికిత్స పొందుతున్నాడు.

రేవంత్ రెడ్డి సభలో ప్రసంగించిన అల్లు అర్జున్ ప్రెస్ మీట్ పెట్టడం ప్రాధాన్యతను సంతరించుకుంది. అనుమతి లేకుండా, బాధ్యతారహితంగా సంధ్యా థియేటర్‌కు వెళ్లాననడం సరికాదని, అది తప్పుడు సమాచారమని అన్నారు. ఇదొక యాక్సిడెంట్ మాత్రమేనని, ఇందులో ఎవరి తప్పులేదని చెప్పారు. సంధ్య థియేటర్ వద్ద రోడ్‌షో చేయలేదని, పోలీసుల డైరెక్షన్‌లోనే థియేటర్‌కు వెళ్లాననీ అన్నారు.

ఈ వ్యాఖ్యలపై ఏసీపీ విష్ణుమూర్తి ఘాటుగా స్పందించారు. బెయిల్‌పై ఉన్న వ్యక్తి ప్రెస్‌మీట్ పెట్టి ఎలా మాట్లాడగలడని, తన తప్పేమీ లేదని ఎలా చెప్పగలడని ప్రశ్నించారు. పోలీసుల డైరెక్షన్‌లోనే వెళ్లాననడం సరికాదని, తమను బాధ్యులుగా చేస్తోన్నట్లు కనిపిస్తోందని మండిపడ్డారు.

ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. అల్లు అర్జున్ పాలు తాగే పిల్లవాడేం కాదని, తప్పొప్పులు ఏమిటో చట్టం, రాజ్యాంగ పరిధి ఏమిటో అతనికి బాగా తెలుసుననే అనుకుంటున్నానని అన్నారు. దాని పరిధిని దాటి మాట్లాడకూడదని విష్ణుమూర్తి హితవు పలికారు.

తమకు బందోబస్తు కావాలంటూ ఓ తెల్ల పేపర్ మీద రాసి ఇస్తే సరిపోతుందా?, తమకు రూల్స్ ఉండవా? అని ఆయన నిలదీశారు. తాము మనుషులమేనని, ప్రజలను రక్షించే పనుల్లో నిమగ్నమై ఉన్న పోలీసుల మీద బడాబాబులు డబ్బు, మదంతో అవాకులు, చెవాకులు చెప్పి, వారి ఆత్మస్థైర్యాన్ని దెబ్బతీస్తోన్నారని మండిపడ్డారు. దర్యాప్తును కూడా ప్రభావితం చేసేలా మాట్లాడుతున్నారని అన్నారు.తొక్కిసలాట జరిగినట్లు పోలీసులెవరూ తనకు చెప్పలేదనడాన్ని విష్ణుమూర్తి తప్పుపట్టారు. ఎందుకు చెప్పాలని ప్రశ్నించారు. అల్లు అర్జున్ ఏమైనా తీస్ మార్ ఖాన్ అనుకుంటున్నాడా?.. ఆయన కూడా ఓ సామాన్య పౌరుడేనని అన్నారు. నీ ఆధార్ కార్డ్ ఎక్కడ ఉందో కూడా మాకు తెలియదు? ఆంధ్రాలో ఉందా? తెలంగాణలో ఉందా? అని నిలదీశారు.

తెలంగాణ అసెంబ్లీలో గంట పాటు అల్లు అర్జున్ గురించి చర్చించడం ఏమిటని, అత్యంత విలువైన ప్రజాధనం వృధా అయిందని అన్నారు. తెలంగాణ సమాజం ఎంతో మంచిదని, ఇక్కడి ప్రజలు సౌమ్యులు కాబట్టే ఆయన ఇంకా ఇక్కడ ఉండగలుగుతున్నారని, నాటకాలు ఇంకా సాగుతున్నాయని ధ్వజమెత్తారు. గరీబోళ్లయిన తెలంగాణ బిడ్డలు వేల రూపాయలు పెట్టి సినిమాలు ఎందుకు చూడాలని విష్ణుమూర్తి ప్రశ్నించారు.

## కుమ్మరిగూడ శ్రీ ముత్యాలమ్మ కి బోనం సమర్పించిన: కార్పొరేటర్ కొంతం దీపిక నరేష్ -పాల్గొన్న కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి,ఎంపీ ఈటెల





**శాసనసభ /హైదరాబాద్ : డిసెంబర్22 :** సికింద్రాబాద్ కుమ్మరిగూడ ముత్యాలమ్మ దేవాలయ విగ్రహ పునర:ప్రతిష్ఠాపన సందర్భంగా ఆదివారం మోండా డివిజన్ కార్పొరేటర్ కొంతం దీపికా నరేష్ ఆధ్వర్యంలో జోగని శ్యామల తో కలిసి అమ్మవారిని భక్తి శ్రద్ధలతో ఇంటి నుండి బోనాలు తీసుకొచ్చి అమ్మవారికి సమర్పించారు.ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా కేంద్ర మంత్రి జి.కిషన్ రెడ్డి మల్కాజ్గిరి ఎంపీ ఈటెల రాజేందర్, ఎమ్మెల్సీ కవిత, కంటోన్మెంట్ బిజెపి కాంటెస్టెడ్ అభ్యర్థి డాక్టర్ వంశీ తిలక్,సికింద్రాబాద్ బిజెపి కాంటెస్టెడ్ అభ్యర్థి మేకల సారంగపాణి, కార్పొరేటర్ సామల హేమ,బిజెపి స్టేట్ ఎగ్జిక్యూటివ్ మెంబర్ బానుక నర్మదా మల్లికార్జున్,బిజెపి స్పోక్స్ పర్సన్ బి.ఎన్ శ్రీనివాస్, ఏనుగుల తిరుపతి పాల్గొని అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి తీర్థ ప్రసాద స్వీకరించారు.అనంతరం కొంతం దీపిక నరేష్ ఆధ్వర్యంలో నిర్వహించిన క్యాలెండర్ ఆవిష్కరణ కార్యక్రమం లో కేంద్రమంత్రి కిషన్ రెడ్డి, మల్కాజ్గిరి ఎంపీ చేతుల మీద గా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా కేంద్ర మంత్రి జి కిషన్ రెడ్డి మాట్లాడుతూ హిందూ సమాజాన్ని, హిందూ మతాన్ని, హిందూ దేవతలను అవమానిస్తూ.పచ్చి మతోన్మాదంగా ఉన్న వ్యక్తి ముత్యాలమ్మ దేవాలయాన్ని ఎలా ధ్వంసం చేసాడో మనం చూసాం.ముత్యాలమ్మ దేవాలయాన్ని పునరుద్ధరించిన తర్వాత ఈరోజు అమ్మవారి దర్శనం చేసుకున్నాను.ఇక్కడున్న స్థానిక ప్రజలు భక్తిశ్రద్ధలతో ప్రతీ ఇంటి నుండి బోనాలు తీసుకొచ్చి అమ్మవారికి సమర్పించారు.హిందూ దేవాలయాలను ధ్వంసం చేసే వ్యక్తులను కఠినంగా శిక్షించాలి.న్యాయం కోసం పోరాటం చేస్తున్న అనేక మంది భారతీయ జనతా పార్టీ, ఆర్ఎస్ఎస్,హిందూ సంఘాల కార్యకర్తల మీద పోలీసులు కేసులు పెట్టారు.తెలంగాణ రాష్ట్రంలో వరుసగా అనేక దేవాలయాల మీద దాడులు జరుగుతున్నా కూడా పోలీసులకు చీమలుకుట్టినట్టు లేదు.రాష్ట్ర ప్రభుత్వం పోలీసులకు పూర్తిస్వేచ్ఛ



కల్పించాలి.మజ్లిస్ పార్టీ అజమాయిషీతో హైదరాబాద్ పోలీసులు పనిచేస్తున్నట్లుగా ఉంది.రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికైనా దేవాలయాలమీద దాడులు చేస్తున్న మతోన్మాద మూకలను అణచివేయాలని కేంద్రమంత్రి డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ఈటల రాజేందర్ మాట్లాడుతూ ఈ ముత్యాలమ్మ ఆలయం పవిత్రమైనది శక్తివంతమైనది.ఈ దేవాలయం మీద జరిగిన దాడిని ప్రజల విశ్వాసాల మీద,నమ్మకాల మీద జరిగిన దాడిగా భావించారు.స్థానిక కార్పొరేటర్ దీపిక, ప్రజానీకం అనేక రోజులుగా ఆందోళన చెందుతున్నారు. అయినా ప్రజలకు ధైర్యాన్ని కల్పించి ఆలయ పునః ప్రతిష్ట చేసేంతవరకు నిద్రపోమని చెప్పి పూర్తి చేసుకున్నారు. అమ్మవారికి బోనం చెల్లించి మొక్కులు చెల్లించుకున్నారు. వేలాది మందితో సామూహిక అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించుకున్నారు.కేంద్ర మంత్రివర్యులు కిషన్ రెడ్డి, అనేకమంది నాయకులు హాజరు కావడం జరిగింది. అమ్మవారు మళ్లీ పూర్వ వైభవాన్ని సంతరించుకుని మా ప్రాంత ప్రజలను చల్లగా చూడమని కోరుకోవడం జరిగింది.నేను కూడా రెండు నెలలుగా ఈ ప్రాంత ప్రజలతో అతి చేరువగా ఉండే భాగ్యం కలిగింది.వారి నమ్మకాన్ని నిలబెట్టే బాధ్యత మా మీద ఉందని మాట ఇస్తున్నాం. పిలిస్తే పలికే వారిగా ఉంటానని చెప్తూ ఈటెల రాజేందర్ అందరికీ శుభాకాంక్షలు తెలియజేశారు..ఈ కార్యక్రమంలో బీజేవైఎం నాయకులు,బిజెపి నేతలు, కార్యకర్తలు, మహిళా భక్తులు తదితరులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.


## ఎన్టీఆర్‌ను విమర్శిస్తే పురందేశ్వరి ఊర్కుంటారా? అమిత్ షా.. అంబేడ్కర్‌ను విమర్శిస్తే పట్టదా?: పొన్నం



**శాసనసభ / హైదరాబాద్ :** పార్లమెంట్‌లో అంబేద్కర్‌ను విమర్శించినట్లు ఎన్టీఆర్‌ను విమర్శిస్తే ఏపీ బీజేపీ అధ్యక్షురాలు పురందేశ్వరి ఊర్కుంటారా అని మంత్రి పొన్నం ప్రభాకర్ ప్రశ్నించారు.ఆదివారం రాజన్న సిరిసిల్ల జిల్లా వేములవాడ మార్కెట్ కమిటీ ప్రమాణస్వీకారోత్సవానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భం గా మాట్లాడుతూ పార్లమెంట్ వేదికగా అంబేద్కర్‌ను కేంద్ర హోంమంత్రి విమర్శించినా పురందేశ్వరి ఏమీ జరగనట్లు మాట్లాడుతున్నారన్నారు. రాహుల్‌గాంధీపై హత్యాయత్నం కేసు నమోదు చేయడం ప్రజాస్వామ్య మా అని ప్రశ్నించారు. కాంగ్రెస్ పాలనలో కక్షసాధింపు ఉండదని, అసెంబ్లీలో సీఎం రేవంత్‌రెడ్డి సినిమా థియేటర్‌లో జరిగిన సంఘటనను వివరించారని చెప్పారు. కేంద్ర మంత్రి బండి సంజయ్ అలా స్పందించడం సరికాదని ఆయన అన్నారు.

## రాష్ట్ర అస్తిత్వాన్ని కాంగ్రెస్ ప్రభుత్వం దెబ్బతీస్తోంది

### తెలంగాణ తల్లి కోసం మరో పోరాటం: ఎమ్మెల్సీ కవిత



**శాసనసభ / హైదరాబాద్:** తెలంగాణ అస్తిత్వాన్ని కాంగ్రెస్ ప్రభుత్వం దెబ్బతీస్తోందని, ఈ చర్యలను తెలంగాణ సమాజం సమష్టిగా అడ్డుకోవాలని బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత పిలుపునిచ్చారు.తెలంగాణ తల్లి నుంచి బతుకమ్మను దూరం చేసిన సీఎం రేవంత్‌రెడ్డి.. ఈ ప్రాంత మహిళలను, పండుగలను అవమానించారని ఆరోపించారు. బీఆర్ఎస్, తెలంగాణ జాగృతి ఎన్ఆర్ఐ విభాగాల ప్రతినిధులతో ఆదివారం ఆమె జూమ్ మీటింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ప్రభుత్వం నిర్ణయించిన రూపం కాకుండా.. గతంలో రూపొందించిన విగ్రహాన్ని ప్రతిష్ఠించాలని పలు గ్రామాల నుంచి విజ్ఞప్తులు వస్తున్నాయని తెలిపారు. కాంగ్రెస్ సర్కారు దుశ్చర్యతో.. ఉద్యమ తెలంగాణ తల్లికోసం మరో పోరాటం చేయాల్సిన పరిస్థితి వచ్చిందన్నారు.బీఆర్ఎస్ పాలనలో నల్లగొండ జిల్లాకు కేసీఆర్ ఏం చేయలేదని సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి చేస్తున్న వ్యాఖ్యలు శుద్ధ అబద్ధాలని బీఆర్ఎస్ నేతలు గ్యాదరి కిషోర్‌కుమార్, కోటిరెడ్డి, బడుగుల లింగయ్యయాదవ్, బూడిద భిక్షమయ్యగౌడ్ అన్నారు. ఆదివారం తెలంగాణ భవన్‌లో వారు మీడియాతో మాట్లాడుతూ.. యాదాద్రి థర్మల్ ప్లాంటు, సాగునీటి కాళేశ్వరం నీళ్లు తేవడమే కాకుండా కేసీఆర్ మిషన్ భగీరథ పథకం చేపట్టి ఏళ్ల తరబడి నల్లగొండ జిల్లాను పట్టి పీడిస్తున్న ఫ్లోరైడ్‌ను తరిమి కొట్టారని చెప్పారు. తుంగతుర్తికి కాళేశ్వరం నీళ్లు తెచ్చిన అంశంపై కోమటిరెడ్డి చర్చకు సిద్ధమా? అని ప్రశ్నించారు.

## ఆర్‌ఓబి పెండింగ్ బిల్లులు మంజూరు చేయండి..
# సీఎంని కోరిన ఎంపీ అర్వింద్



**శాసనసభ / హైదరాబాద్ :** ఇటీవల కేంద్ర కేబినెట్ జగిత్యాల, నిజామాబాద్ జిల్లాలో నవోదయల ఏర్పాటు చేసిన విషయం తెలిసిందే. ఈనేపథ్యంలో జూబ్లీహిల్స్ లోని సీఎం రేవంత్ రెడ్డి నివాసంలో జగిత్యాల శాసనసభ్యులు డా.సంజయ్ కుమార్ తో కలిసి ఈ రెండు జిల్లాల్లో నవోదయల ఏర్పాటుకు ఒక్కోచోట సుమారు 20 ఎకరాల భూమిని రాష్ట్ర ప్రభుత్వం అందజేయాలని నిజామాబాద్ పార్లమెంట్ సభ్యులు అర్వింద్ ధర్మపురి, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని కోరారు.ఈ సందర్భంగా రెండు జిల్లాల్లో పలు ప్రతిపాదిత స్థలాలను సీఎంకు ఎంపీ వివరించారు.నిజామాబాద్ పార్లమెంట్ పరిధిలో కొనసాగుతున్న రైల్వే ప్రాజెక్టులను ఎంపీ అర్వింద్ వివరిస్తూ, మాధవ్ నగర్ ఆర్‌ఓబి 50-50 పద్ధతిలో మంజూరు చేయబడిందని, అడివి మామిడిపల్లి ఆర్‌ఓబి పూర్తిగా కేంద్ర ప్రభుత్వ నిధులతో మంజూరైనప్పటికీ, గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం నిధులను మళ్ళించిందన్నారు. కాంట్రాక్టర్లు సకాలంలో బిల్లులు అందక తీవ్రంగా ఇబ్బంది పడుతున్నారని తెలిపారు. దీనివల్ల పనుల్లో కొంత జాప్యం జరుగుతుందన్నారు. అంతేకాకుండా ఇతర ఆర్వోబీల పరిస్థితి కూడా ఇదే విధంగా ఉందని సీఎంకు వివరించారు. కాంట్రాక్టర్లకు బిల్లులు మంజూరు చేసి, పనులను త్వరితగతిన పూర్తయ్యేలా చొరవ చూపాలని సీఎంను కోరారు.జిల్లాలో ప్రతిపాదిత జక్రాన్ పల్లి ఎయిర్పోర్ట్ పనులకు సంబంధించి ఓఎల్ఎస్ సర్వేని రాష్ట్ర ప్రభుత్వం త్వరితగతిన పూర్తి చేసి కేంద్రానికి నివేదించాలని కోరారు. మరోవైపు జగిత్యాల పట్టణంలో కేంద్రీయ విద్యాలయం సైతం మంజూరయ్యే దశలో ఉందని, దీనికి కూడా స్థల అన్వేషణ చేయాలని సీఎంని కోరారు. జగిత్యాల శాసనసభ్యులు డా. సంజయ్ కుమార్ ఎంపీ అర్వింద్ తో కలిసి జగిత్యాల పట్టణానికి సంబంధించి పలు అభివృద్ధి కార్యక్రమాలపై ముఖ్యమంత్రితో చర్చించారు. తామ విజ్ఞప్తుల పట్ల సీఎం రేవంత్ రెడ్డి సానుకూలంగా స్పందించారని ఎంపీ అరవింద్ తెలియజేశారు.

## బంగారు నాణేల పేరుతో రూ.7లక్షలు కాజేసిన కేటుగాడు..



**శాసనసభ / హైదరాబాద్ :** నిజామాబాద్ జిల్లాలో ఘరానా మోసం వెలుగులోకి వచ్చింది. సిరికొండ మండలం పోతన్నూర్‌లో యువకునికి బంగారం నాణేలు పేరుతో రూ.7 లక్షలు కాజేశాడు ఓ కేటుగాడు.తవ్వకాల్లో బంగారు నాణేలు దొరికాయనీ, తక్కువ ధరకు ఇస్తానంటూ మహేష్ అనే వ్యక్తికి అపరిచిత వ్యక్తి ఫోన్ కాల్ చేశాడు. కుండలో బంగారు నాణేలు దొరికాయని నమ్మబలికాడు. దీంతో నిజమేనని నమ్మని మహేష్ అవి తీసుకుని అమ్ముకుంటే ఎక్కువ డబ్బులు వస్తాయని ఆశపడ్డాడు. నాణేలు ఎంతకు వస్తాయని మహేష్ అడగగా రూ.7 లక్షలకు ఇస్తానని కేటుగాడు బేరమాడాడు.దీంతో చవకగా వస్తున్నాయని అవి తీసుకుని లక్షల్లో అమ్ముకోవచ్చని అతి ఆశకు పోయాడు. అయితే ఆ నాణేలు కావాలంటే బెంగళూరు సి-మార్కెట్‌కు రావాలని కేటుగాడు తెలిపాడు. దీంతో మహేష్ నిజమని నమ్మి బెంగళూరు సి మార్కెట్‌కు వెళ్లాడు. గ్రాము ఒరిజినల్ బంగారం ఇచ్చి పరీక్షించుకోవాలి ఎరవేశాడు. అది చూసి మహేష్ అంతా నిజమైన బంగారం అని నమ్మాడు. దీంతో మహేష్ అతనికి తన వద్ద వున్న రూ.7 లక్షలు ఇచ్చాడు. మహేష్ ఇంటికి వచ్చి పరీక్షించగా నకిలీ బంగారంగా తేలడంతో పోలీసులకు బాధితుని ఫిర్యాదు చేశాడు.

## కరెంట్ ఖాతాల ద్వారానే ఎక్కువగా సైబర్ నేరాలు

గతేడాదితో పోలిస్తే ఈ ఏడాది 45 శాతం ఎఫ్ఐఆర్‌లు పెరిగినట్లు వివరించారు.''పెరిగిన ఫిర్యాదుల్లో చిన్నచిన్న చోరీలు, యాక్సిడెంట్ కేసులు ఉన్నాయి. గతంలో చిన్న ఫిర్యాదులకు ఎఫ్ఐఆర్ నమోదు జరగకపోయేది. ఇప్పుడు ప్రతి చిన్న నేరానికి కూడా ఎఫ్ఐఆర్ నమోదు చేయడంవల్ల కేసుల సంఖ్య పెరిగింది. కిడ్నాప్ కేసుల్లో 85 శాతం పెరుగుదల నమోదైంది. మొబైల్ చోరీల సంఖ్య కూడా గణనీయంగా పెరిగింది. సైబర్ నేరాల వల్ల డబ్బులు పోగొట్టుకున్న వారి సంఖ్య పెరుగుతోంది. ప్రజల్లో ఎంత అవగాహన కల్పించినా.. ప్రజలు మోసపోతున్నారు.డిజిటల్ అరెస్టు అనగానే భయపడి డబ్బులు పోగొట్టుకుంటున్నారు.పెట్టుబడుల విషయంలోనూ మోసపోతున్నవారు అధిక సంఖ్యలో ఉన్నారు. గతేడాది కంటే 91 శాతం ఎక్కువ డబ్బు పోగొట్టుకున్నారు.కరెంట్ ఖాతాల ద్వారా సైబర్ నేరాలు ఎక్కువ జరుగుతున్నాయి. ఎటువంటి విచారణ లేకుండానే కొందరికి బ్యాంక్ సిబ్బంది కరెంట్ ఖాతాలు ఇస్తున్నారు. కొందరు బ్యాంక్ సిబ్బంది కూడా సైబర్ నేరగాళ్లకు సహకరిస్తున్నారు" అని సీవీ ఆనంద్ వివరించారు.

## అల్లు అర్జున్ ఇంటిపై రాళ్ల దాడి

ఈ క్రమంలో కొందరు నిరసనకారులు అల్లు అర్జున్ నివాసంపై రాళ్లు విసిరారు. ఆయన ఇంట్లోకి నినాదాలు చేసుకుంటూ దూసుకెళ్లేందుకు యత్నించారు. రాళు తగిలి అల్లు అర్జున్ ఇంటి ఆవరణలోని పూల కుండీలు, గార్డెన్‌లోని మొక్కలు ధ్వంసమయ్యాయి.విద్యార్థి సంఘాల ఆందోళన నేపథ్యంలో పోలీసులు అక్కడికి చేరుకుని వారిని అదుపులోకి తీసుకున్నారు. నివాసం దగ్గర అదనపు పోలీసు బలగాలతో బందోబస్తు ఏర్పాటు చేశారు. పోలీసులు భారీగా మోహరించారు. ఘటన జరిగిన సమయంలో నటుడు అల్లు అర్జున్ తన నివాసంలో లేరని సమాచారం. విషయం తెలుసుకున్న ఆయన మామ, కాంగ్రెస్ నేత కంచర్ల చంద్రశేఖర్ రెడ్డి అక్కడికి చేరుకుని ఈ ఘటనపై ఆరా తీస్తున్నారు. జరిగిన రాళ్ల దాడిపై సెక్యూరిటీ సిబ్బంది జూబ్లీహిల్స్ పోలీసులకు ఫిర్యాదు చేసే అవకాశమున్నట్టు తెలుస్తోంది.అల్లు అర్జున్ ఇంటిపై జరిగిన దాడిపై ఆయన తండ్రి అల్లు అరవింద్ స్పందించారు. "మా ఇంటి ముందు జరిగిన ఘటన మీరంతా చూశారు. ఇలా ఎవరికీ జరగకూడదు. ఇలాంటి పరిస్థితుల్లో అందరూ సమయనం పాటించాలి అదే మంచిది. తొందరపడి చర్యలకు దిగొద్దు" అని అల్లు అరవింద్ తెలిపారు. ఈ రాళ్ల దాడిపై పోలీసులకు ఫిర్యాదు చేశారా? అని మీడియా ప్రశ్నకు అల్లు అరవింద్ స్పందించకుండా వెళ్లిపోయారు.

## ఏదో జరిగినట్లు.. అల్లు అర్జున్‌ను పెద్ద హీరోలు పరామర్శించడం విడ్డూరంగా ఉంది!



**శాసనసభ / హైదరాబాద్ :** పోలీసులు వద్దన్నా సినీ హీరో అల్లు అర్జున్ ఆర్టీసీ క్రాస్ రోడ్డులోని సంధ్య థియేటర్‌కు వెళ్లాడని రోడ్లు భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి మండిపడ్డారు. రేవతి మరణానికి అల్లు అర్జున్ కారణం అయ్యాడన్నారు. ఒక వ్యక్తి ప్రాణాలు కోల్పోవడం మామూలు విషయం కాదని, ఘటన జరిగిన తర్వాత కనీసం పరామర్శించకపోవడం దారుణం అని పేర్కొన్నారు. ఏదో జరిగినట్లు అల్లు అర్జున్‌ను పెద్దపెద్ద హీరోలు పరామర్శించడం విడ్డూరంగా ఉందని, చట్టం ముందు అందరూ సమానులే అని మంత్రి కోమటిరెడ్డి అన్నారు. సీఎం రేవంత్ రెడ్డికి అల్లు అర్జున్ వెంటనే క్షమాపణ చెప్పాలని ఆయన డిమాండ్ చేశారు. శనివారం అల్లు అర్జున్ చేసిన వ్యాఖ్యలపై మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి స్పందించారు. మీడియాతో మాట్లాడుతూ. 'పోలీసులు వద్దన్నా అల్లు అర్జున్ సంధ్య థియేటర్‌కు వెళ్లాడు. థియేటర్‌వద్ద తొక్కిసలాటలో మృతిచెందిన రేవతి మరణానికి అల్లు అర్జున్ కారణమయ్యాడు. ఒక వ్యక్తి ప్రాణాలు కోల్పోవడం మామూలు విషయం కాదు. ఘటన జరిగిన తర్వాత కనీసం పరామర్శించకపోవడం దారుణం. ఏదో జరిగినట్లు అల్లు అర్జున్‌ను పెద్దపెద్ద హీరోలు పరామర్శించడం విడ్డూరంగా ఉంది. చట్టం ముందు అందరూ సమానులే.స్టార్‌లకు ప్రత్యేక మినహాయింపులు ఉండవు. అరెస్టు కోసం ఇంటికి వెళ్లిన పోలీసుల పట్ల అల్లు అర్జున్ దురుసుగా ప్రవర్తించాడు. పోలీసులు సహనంతో వ్యవహరించారు' అని అన్నారు.'ఏసీపీ, డీసీపీ చెప్పిన తర్వాతనే థియేటర్ నుండి అల్లు అర్జున్ బయటకి వెళ్ళాడు. ఇమేజ్ దెబ్బతీశారంటూ సీఎం వ్యాఖ్యలపై ఎదురుదాడిగా మాట్లాడటం సరికాదు. సభా నాయకుడు, సీఎంకు అల్లు అర్జున్ క్షమాపణ చెప్పాలి. అసెంబ్లీలో సీఎం చేసిన ప్రకటనను ఎదిరించడం తప్పు. మేం సినీ నటులను గౌరవిస్తాం. మంచి సినిమాలు తీస్తే ప్రోత్సహిస్తాం. సినీ రంగ అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం కట్టుబడి ఉంది. ఇక నుంచి బెనిఫిట్ షోలు ఉండవు' అని మంత్రి కోమటిరెడ్డి తెలిపారు.

## అల్లు అర్జున్‌లో కనీసం పశ్చాత్తాపం కనిపించడం లేదు..



**శాసనసభ / హైదరాబాద్ :** అల్లు అర్జున్ వ్యవహార శైలి దారుణంగా ఉందని ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ అన్నారు. అల్లు అర్జున్‌లో కనీసం ప్రశ్చాత్తాపం కనిపించడం లేదు..రేవతి కుటుంబం పైన అల్లు అర్జున్ కనీస సానుభూతి చూపించలేదని తెలిపారు. సీఎం రేవంత్ రెడ్డి అసెంబ్లీలో మాట్లాడిన మాటలను తప్పు పట్టేలా అల్లు అర్జున్ తీరు ఉందని పేర్కొన్నారు. అక్బరుద్దీన్ ఓవైసీ అసెంబ్లీలో చేసిన ప్రస్తావన పైనే సీఎం రేవంత్ రెడ్డి స్పందించారని ఆది శ్రీనివాస్ అన్నారు. తొక్కిసలాటలో ఇద్దరు చనిపోయారని అల్లు అర్జున్‌కి పోలీసులు చెప్పిన తర్వాత థియేటర్‌లో షో చేశారని వ్యాఖ్యానించారు. అల్లు అర్జున్.. సమాజంలో నీ గురించి ఏమనుకుంటున్నారో అడిగి చూడు అని అన్నారు.వ్యక్తిగత ప్రతిష్ట గురించే తప్ప చనిపోయిన రేవతి.. ఆస్పత్రిలో చావు బతుకుల మధ్య కొట్టుమిట్టాడుతున్న బాబు గురించి ఆలోచన లేదని ఆది శ్రీనివాస్ ఆరోపించారు. నీ పేరు ప్రతిష్టలు అవతలి వారు ప్రాణాల కంటే ఎక్కువా..? అని దుయ్యబట్టారు. అల్లు అర్జున్ ఇంకా దబాయించి మాట్లాడుతున్నాడని ఫైరయ్యారు.సీఎం అసెంబ్లీలో పోలీసులు ఇచ్చిన అధికారిక సమాచారాన్ని ఇచ్చారు.. అల్లు అరవింద్ మాట్లాతున్న తీరు సిగ్గుతో తలదించుకునేలా ఉందని ఆది శ్రీనివాస్ తెలిపారు. తన కొడుకు మూడీగా ఉంటున్నాడని అల్లు అరవింద్ అంటున్నాడు.. అల్లు అరవింద్ గారు.. అవతల ఒక ప్రాణం ఐసీయూలో ఉలుకు పలుకు లేకుండా పడి ఉందని అన్నారు. అల్లు అర్జున్ తీరు పైన తెలంగాణ ప్రజలు ఆలోచించాలని ఆది శ్రీనివాస్ పేర్కొన్నారు.

## నేడు మెదక్ జిల్లాలో గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ పర్యటన..



**శాసనసభ / హైదరాబాద్ :** కేథడ్రల్ చర్చి శత వసంత వేడుకల్లో భాగంగా నేడు మెదక్ జిల్లాలో గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ పర్యటించనున్నారు. రోడ్డు మార్గాన ఉదయం 11 గంటలకు మెదక్ చేరుకోనున్నారు. మెదక్ క్యాథడ్రల్ చర్చి వందేళ్ల వేడుకలో జిష్ణుదేవ్ వర్మ పాల్గొననున్నారు. అనంతరం కొల్చారం బాలికల సాంఘిక సంక్షేమ గురుకులంలో విద్యార్థులతో గవర్నర్ పరస్పర చర్చ చేస్తారు. విద్యార్థినులతో కలిసి లంచ్ చేసి ఆహారాన్ని గవర్నర్ జిష్ణుదేవ్ పరిశీలించనున్నారు. మధ్యాహ్నం 3 గంటలకు తిరిగి హైదరాబాద్ బయలుదేరనున్నారు. గవర్నర్ పర్యటన నేపథ్యంలో మెదక్‌లో ట్రాఫిక్ ఆంక్షలు విధించారు. గవర్నర్ పర్యటన నేపథ్యంలో పోలీసులు పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేశారు.శతాబ్ది ఉత్సవాలు ఆదివారం నుంచి ప్రారంభం కానున్నాయి. ఇందులో భాగంగా చర్చిలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించనున్నారు. 23వ తేదీ సోమవారం నాడు చర్చి ఆవరణలో ప్రత్యేక కృతజ్ఞత కార్యక్రమం నిర్వహించనున్నారు. చర్చి వ్యవస్థాపకుడు రెవరెండ్ చార్లెస్ వాకర్ పాస్‌నెట్ యొక్క మూడవ తరం కుటుంబ సభ్యులు ఈ వేడుకల్లో పాల్గొంటారు.

## ఎన్నికల సంఘం సమగ్రతను నాశనం చేసేందుకు కుట్ర

ఇవన్నీ చూస్తుంటే ఈసీ తన స్వతంత్రతను కోల్పోతోందని స్పష్టమవుతోంది"అని ఖర్గే పేర్కొన్నారు. లోక్‌సభ ఎంపీ, కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్ మాట్లాడుతూ ఎన్నికల సంఘం ప్రభుత్వానికి అనుకూలంగా చర్యలు చేపడుతోందని ఆరోపించారు. ఈ సవరణను న్యాయపరంగా సవాలు చేస్తామని కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి జైరాం రమేశ్ ఇప్పటికే స్పష్టం చేశారు. కోర్టు తీర్పును పాటించాల్సిన ఈసీ.. అందుకు విరుద్ధంగా నిబంధనలకు సవరణ చేయడం విడ్డూరమని అన్నారు.కాగా ఎన్నికల సంఘం సిఫార్సు మేరకు.. ఎన్నికల నిర్వహణ నిబంధనలు-1961లోని రూల్ 93(2)(ఏ)ను శుక్రవారం కేంద్ర న్యాయశాఖ సవరించింది. పోలింగ్ బూత్‌లలోని సీసీ టీవీ కెమెరాల తనిఖీ వల్ల ఓటర్ల గోప్యతకు భంగం కలుగుతోందని, అందుకే నిషేధం విధించామని అధికారిక వర్గాలు వెల్లడించాయి. వినియోగించుకుని కృత్రిమ మేధ ద్వారా నకిలీ వీడియోలను తయారు చేస్తున్నారని తెలిపాయి. రూల్ 93కి సవరణ తర్వాతా అభ్యర్థులకు ఎలక్ట్రానిక్ రికార్డులు అందుబాటులో ఉంటాయని, కానీ ఇతరులు తనిఖీ చేయడానికి అనుమతి ఉండదని వివరించాయి.

## అల్లు అర్జున్‌కు మేం వ్యతిరేకం కాదు.. తప్పు ఎవరు చేసిన కేసు నమోదు చేస్తాం : డీజీపీ

చట్టం దృష్టిలో అందరూ సమానమేనని, పోలీసులు ఏ వర్గానికి వ్యతిరేకం కాదని తెలంగాణ డీజీపీ జితేందర్ అన్నారు.పౌరుల భద్రత తమకు ముఖ్యమని చెప్పారు. కరీంనగర్ జిల్లా కొత్తపల్లిలో కొత్తగా నిర్మించిన భరోసా కేంద్రాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా సంధ్య థియేటర్ ఘటనపై స్పందించారు. అల్లు అర్జున్ సినీ హీరో అయినా క్షేత్రస్థాయిలో పరిస్థితులను అర్థం చేసుకోవాల్సిన అవసరం ఉందని చెప్పారు.సమాజంలో శాంతిభద్రతలు ఫరిఢవిల్లాలంటే పౌరులు బాధ్యతాయుతంగా వ్యవహరించాల్సిన అవసరం ఉందని డీజీపీ గుర్తు చేశారు. సినీ ప్రమోషన్ కంటే పౌరుల భద్రత, రక్షణే తమకు ప్రాధాన్యమని స్పష్టంచేశారు. ఇలాంటి ఘటనలు జరగడం సమాజానికి ఏమాత్రం మంచిది కాదన్నారు. తెలంగాణ ప్రభుత్వం మహిళలు, పిల్లల సంరక్షణకు అత్యంత ప్రాధాన్యమిస్తుందని, అందువల్లే ప్రతి జిల్లా కేంద్రంలో భరోసా కేంద్రాన్ని ఏర్పాటు చేస్తున్నామని పేర్కొన్నారు.రాష్ట్రంలో 20 ఎస్పీ కార్యాలయాలు, మరో 9 కమిషనరేట్‌లు ఉన్నాయని, ఇప్పటివరకు 27 భరోసా కేంద్రాలను ప్రారంభించినట్లు డీజీపీ చెప్పారు. సినిమాల్లో హీరోలైనా బయట మాత్రం పౌరులేనని అన్నారు. క్షేత్రస్థాయి పరిస్థితులను కూడా తెలుసుకోవాలని సూచించారు. చట్టానికి లోబడి పోలీసు శాఖ పని చేస్తుందని, తప్పు ఎవరు చేసినా కేసులు నమోదు చేస్తామని స్పష్టంచేశారు.పౌరుల రక్షణే తమకు ప్రాధాన్యమని, అల్లు అర్జున్‌కు తాము వ్యతిరేకం కాదని డీజీపీ తెలిపారు. చట్టప్రకారం అల్లు అర్జున్‌పై చర్యలు తీసుకున్నామని, సంధ్య థియేటర్ ఘటన దురదృష్టకరమని అన్నారు.

( మొదటి పేజీ తరువాయి )

### అల్లు అర్జున్ నివాసంపై దాడిని ఖండించిన సీఎం రేవంత్ రెడ్డి

ఆదివారం (డిసెంబరు 22న) మధ్యాహ్నం ఓయూ జేఏసీ విద్యార్థి సంఘాల ఆందోళనతో జూబ్లీహిల్స్‌లోని సినీ నటుడు అల్లు అర్జున్ ఇంటి వద్ద ఉద్రిక్త పరిస్థితులు తలెత్తిన సంగతి తెలిసిందే. సంధ్య థియేటర్ తొక్కిసలాటలో రేవతి మరణానికి అల్లు అర్జున్ కారణమంటూ పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. రేవతి కుటుంబానికి తక్షణమే రూ.కోటి పరిహారం చెల్లించాలని ఆందోళనకారులు డిమాండ్ చేశారు. ఈ క్రమంలో కొందరు అల్లు అర్జున్ ఇంటిపై రాళ్లు విసిరారు. ఆయన ఇంట్లోకి దూసుకెళ్లేందుకు ప్రయత్నించి విఫలం అయ్యారు. అల్లు అర్జున్ ఇంటి ఆవరణలోని పూల కుండీలను పగలగొట్టి ధ్వంసం చేశారు. ఈ ఘటన నేపథ్యంలో సినీ ప్రముఖుల ఇళ్లపై దాడులను ఖండిస్తూ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి 'ఎక్స్'లో ట్వీట్ చేశారు.

### అల్లు అర్జున్ నివాసంపై దాడి వెనకున్నది కాంగ్రెస్ పార్టీయేనా?

అల్లు అర్జున్ నివాసంపై రాళ్ల దాడి ఘటన రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఆధ్వర్యంలో శాంతిభద్రతలు దిగ్భ్రాంతికర రీతిలో క్షీణించాయన్న వాస్తవాన్ని ఎత్తిచూపుతోందని పేర్కొన్నారు. పౌరుల భద్రతకు భరోసా ఇవ్వడంలోనూ, వారికి రక్షణ కల్పించడంలోనూ పాలకుల అసమర్థత ప్రతిఫలిస్తోందని విమర్శించారు.నటులను,చిత్రపరిశ్రమను టార్గెట్ చేయడం అనేది తెలంగాణలోని కాంగ్రెస్ ప్రభుత్వ పాలనలో కనిపిస్తున్న ప్రమాదకర ధోరణి అని కిషన్ రెడ్డి ఆందోళన వ్యక్తం చేశారు. అల్లు అర్జున్ నివాసంపై దాడి వెనకున్నది కాంగ్రెస్ పార్టీయేనా? ఇది కాంగ్రెస్ ప్రోత్సాహంతో జరిగిన దాడేనా? అని సందేహం వెలిబుచ్చారు. ఈ మేరకు దాడి వీడియోను కూడా కిషన్ రెడ్డి పంచుకున్నారు.

### ముఖ్యమంత్రికి అల్లు అర్జున్ వెంటనే క్షమాపణ చెప్పాలి

టాలీవుడ్ హీరో అల్లు అర్జున్ నిన్న ప్రెస్ మీట్ లో చేసిన వ్యాఖ్యలపై తెలంగాణ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి స్పందించారు. రేవంత్ రెడ్డి అసెంబ్లీలో చేసిన వ్యాఖ్యలపై ఎదురుదాడిగా మాట్లాడడం సరికాదని అన్నారు. ముఖ్యమంత్రికి అల్లు అర్జున్ వెంటనే క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు.తన ఇమేజ్ ను దెబ్బతీశారని అల్లు అర్జున్ మాట్లాడుతున్నారని... బాధిత కుటుంబాన్ని పరామర్శించేందుకు తన లీగల్ టీమ్ ఒప్పుకోవడం లేదని చెప్పడం హాస్యాస్పదంగా ఉందని కోమటిరెడ్డి విమర్శించారు. తెలంగాణలో ఇకపై బెనిఫిట్ షోలు ఉండవని మంత్రి స్పష్టం చేశారు.

## అల్లు అర్జున్ కు బండి సంజయ్ సపోర్ట్

అల్లు అర్జున్ వ్యక్తిత్వాన్ని హననం చేస్తున్నారని బండి సంజయ్ విమర్శించారు. ఇటీవల జరుగుతున్న పరిణామాలను చూస్తే..రేవంత్ రెడ్డి తెలుగు సినీ పరిశ్రమపై పగబట్టినట్టుగా ఉందని అన్నారు. పక్కా ప్లాన్ తో ఎంఐఎంతో కలిసి కాంగ్రెస్ ప్రభుత్వం టాలీవుడ్ ఇండస్ట్రీని దెబ్బతీసే కుట్ర చేస్తోందనిని వ్యాఖ్యానించారు."తొక్కిసలాట ఘటనలో సమస్య ముగిసిన తర్వాత నిన్న ఎంఐఎం సభ్యుడితో అసెంబ్లీలో ప్రశ్న అడిగించుకున్నారు. ఆ ప్రశ్నకు సమాధానమిస్తున్నట్టుగా... ఓ సినిమా స్థాయిలో కథ అల్లి మరీ, మళ్లీ సమస్యను సృష్టించడం సిగ్గుచేటు. ఎంఐఎం ఒక ఐరన్ లెగ్ పార్టీ... గతంలో ఆ పార్టీ బీఆర్ఎస్ తో అంటకాగి, ఆ పార్టీని నిండా ముంచింది. అలాంటి పార్టీని నమ్ముకుంటే కాంగ్రెస్ పార్టీకి కూడా అదే గతి పట్టడం ఖాయం" అని బండి సంజయ్ స్పష్టం చేశారు.

## "అంబేద్కర్ వ్యాఖ్యల"పై అమిత్ షాకి వ్యతిరేకంగా డీఎంకే తీర్మానం..

హెూంమంత్రి ప్రసంగం నుండి దృష్టి మరల్చేందుకు పార్లమెంటు లోపల మరియు వెలుపల బిజెపి ప్రదర్శించిన డ్రామా చాలా హాస్యాస్పదంగా ఉందని కార్యనిర్వాహక కమిటీ అభిప్రాయపడింది" అని తీర్మానంలో పేర్కొంది.డిసెంబర్ 17న అమిత్ షా రాజ్యసభలో మాట్లాడుతూ.. ఇప్పుడు ప్రతిపక్షాలు అంబేద్కర్, అంబేద్కర్, అంబేద్కర్, అంబేద్కర్, అంబేద్కర్, అంబేద్కర్ అని చెప్పడం ఫ్యాషన్ అయిపోయింది, ఇంతలా దేవుడు పేరు తలుచుకుంటే వారికి స్వర్గంలో చోటు లభించి ఉండేది అని అన్నారు. ఈ వ్యాఖ్యలే మొత్తం వివాదానికి కారణమైంది. అయితే, ఈ స్పీచ్‌లోని కొంత భాగాన్ని కాంగ్రెస్ ఎంపీలు, కాంగ్రెస్ నేతలు షేర్ చేసుకున్నారని బీజేపీ ఆరోపించింది. అయితే, అమిత్ షా వ్యాఖ్యలను ప్రధాని నరేంద్ర మోడీ సమర్థించారు. అంబేద్కర్‌ని అవమానించిన కాంగ్రెస్ చీకటి చరిత్రను హెూంమంత్రి బయటపెట్టారని అన్నారు.

## అప్పిస్తే జైలుకే: వడ్డీ వ్యాపారాలను నియంత్రించేందుకు కొత్త చట్టం 'బులా'

లోన్ యాప్‌ల వేధింపుల కారణంగా ఎంతోమంది ఆత్మహత్య చేసుకుంటున్నారు. అవసరాలకు అధిక వడ్డీకి అప్పు తీసుకొని తిరిగి చెల్లించలేక బలవన్మరణాలకు పాల్పడుతున్నారు. ఈ నేపథ్యంలో వాటిని కట్టడి చేసేందుకు కేంద్ర ప్రభుత్వం కొత్త చట్టాన్ని తీసుకురానుంది. అనుమతులు లేకుండా భౌతికంగా లేదా డిజిటల్ (ఆన్‌లైన్) మార్గంలో రుణాలు ఇచ్చే వారికి పదేళ్ల వరకూ జైలు శిక్షతో పాటు కోటి రూపాయల వరకూ జరిమానా విధించేలా కొత్త బిల్లును ప్రతిపాదించింది. ఇది చట్టంగా మారితే బంధువులకు ఇచ్చే రుణాలు మినహా పర్మిషన్ లేని వడ్డీ వ్యాపారులు, లోన్ యాప్‌లు అప్పులు ఇవ్వడం కుదరదు.నియంత్రిత రుణాలకు సంబంధించిన ఏ చట్టం పరిధిలోకి రాని భౌతిక, డిజిటల్ లేదా ఇతర మార్గాల్లో నిర్వహించే రుణ కార్యకలాపాలను (బంధువులకిచ్చే రుణాలు మినహా) అనియంత్రిత రుణ వ్యాపారంగా బిల్లు నిర్వహించింది. నియమావళికి విరుద్ధంగా రుణాలిచ్చే వారికి కనీసం రెండేళ్ల నుంచి ఏడేళ్ల వరకూ జైలు శిక్షతో పాటు రెండు లక్షల రూపాయల నుంచి కోటి వరకూ జరిమానా విధించనున్నట్లు బిల్లులో ప్రతిపాదించారు. రుణ గ్రహీతలను వేధించడం లేదా అనైతిక పద్ధతుల్లో బకాయిల రికవరీకి పాల్పడే వారికి మూడేళ్ల నుంచి పదేళ్ల వరకు జైలు శిక్షతో పాటు జరిమానా కూడా విధించాలని బిల్లులో ప్రతిపాదించారు. అనియంత్రిత రుణదాత, రుణ గ్రహీతలు, ప్రాపర్టీలు పలు రాష్ట్రాలు లేదా కేంద్ర పాలిత ప్రాంతాల్లో విస్తరించి ఉన్న పక్షంలో లేదా ప్రజా ప్రయోజనాలకు భంగం కలిగించే స్థాయి సొమ్ముకు సంబంధించిన కేసును సీబీఐకి బదిలీ చేయాలని కూడా బిల్లులో ప్రతిపాదించారు. బ్యానింగ్ ఆఫ్ అన్ రెగ్యులేటెడ్ లెండింగ్ యాక్టివిటీస్ (బీయూఎల్ఎ,బులా) పేరుతో రూపొందించిన ఈ ముసాయిదా బిల్లుపై 2025 ఫిబ్రవరి 13 నాటికి సూచనలు, అభిప్రాయాలు తెలపాలని ప్రభుత్వం ప్రజలను కోరింది.